సాక్షి
జనగామ

బుధవారం | 9 | అక్టోబర్ | 2024



గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ప్రణాళిక
20వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. - 2లో▸



డ్యూటీ మీట్ పోటీలతో వృత్తిలో నైపుణ్యం - 2లో▸
డ్యూటీ మీట్ పోటీల్లో పాల్గొనడం వల్ల పోలీస్ అధికారులు తమ వృత్తిలో రాణించగలరని వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు.

గరిష్టం/కనిష్టం
32^0 /24^0

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడా ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జనగామ మార్కెట్‌కు సెలవులు

జనగామ: దసరా పండుగను పురస్కరించుకుని ఖరీదుదారులు, అడ్తీదారుల కోరిక మేరకు జనగామ వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు వరుసగా.. నాలుగు రోజుల పాటు సెలవులు ప్రకటించి నట్లు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి (ఎఫ్‌ఎస్‌) శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10న దుర్గాష్టమి, 11న మహర్నవమి, 12న దసరా, 13న సాధారణ సెలవుగా ప్రకటించినట్లు తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సరుకులను తీసుకురావొద్దన్నారు. 14వ తేదీ(సోమవారం) మార్కెట్ యార్డు పునఃప్రారంభమవుతుందని తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలు

జనగామ: కలెక్టరేట్‌లో నేడు (బుధవారం) సాయంత్రం 4 గంటలకు బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్నట్లు టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు ఖాజాషరీఫ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, విశిష్ట అతిథులుగా అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్ తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. వేడుకలకు అన్ని శాఖల మహిళా ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు. సంస్కృతీ, సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మలను ఎంపిక చేసి, కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నగేశ్



రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ గ్రామానికి చెందిన బిర్రు నగేశ్ వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ అత్యవసర సమావేశంలో నగేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నగేశ్ మాట్లాడుతూ.. నమ్మకంతో తనను ఎన్నుకున్నందుకు దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, జాతీయ, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేస్తానని ఆయన పేర్కొన్నారు.

నేత శిక్షణ కేంద్రం ప్రారంభం



జనగామ రూరల్: పట్టణంలోని స్థానిక వీవర్స్ కాలనీలో మంగళవారం చేనేత శిక్షణ కేంద్రం ప్రారంభమైంది. ఈసందర్భంగా పీఆర్‌ఓ వై.శ్రీనివాస్ మాట్లాడుతూ.. భారతప్రభుత్వం జౌళి మంత్రిత్వ శాఖ, చేనేత అభివృద్ధి కమిషనర్ చేనేత సేవా కేంద్రం హైదరాబాద్ ఆధ్వర్యంలో శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈకేంద్రంలో 17 మంది మహిళలు చేరారని, యువకులకు చేనేత వృత్తిలో మెలకువలు 45 రోజుల పాటు రోజు ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:30 వరకు నేర్పించి రోజుకు రూ.300 భృతి ఇవ్వనున్నట్లు తెలిపారు. చేనేత కేవలం భౌతిక వృత్తే కాకుండా.. కళాత్మకంగా, నైపుణ్యంతో కూడిన పని కావడంతో దీన్ని నేర్చుకునేందుకు ఎక్కువ సమయం కేటాయించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా మహిళలకు, యువకులకు చేనేత కిట్లు అందజేశారు. కార్యక్రమంలో చేనేత సొసైటీ నిర్వాహకులు బొంతపల్లి నాగరాజు, శ్రీరామ్ శ్రీనివాస్, కూరపాటి శ్రీనివాస్, కూరపాటి సుభాష్, మేఘరాణి, బొల్లం ఉదయ్, బీమనాథ హరీశ్, గుమ్మడవెల్లి చైతన్య, ఘనపురం ఉమ, స్థానికులు పాల్గొన్నారు.

సద్దులకు ఏర్పాట్ల పరిశీలన



జనగామ: జనగామ జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంటలో సద్దుల బతుకమ్మ, దసరా పండుగ ఏర్పాట్లను మంగళవారం డీసీసీ అధ్యక్షుడు, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పరిశీలించారు. అంతకుముందు శ్రీ విజయదుర్గా మాత ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట నాయకులు డాక్టర్ రాజమౌళి, వాంకుడోతు అనిత, గాదెపాక రాంచందర్, కర్రె శ్రీనివాస్, బొట్ల శ్రీనివాస్, లింగాల నర్సిరెడ్డి, ఆలేటి సిద్దిరాములు, వంగాల మల్లారెడ్డి, బనుక శివరాజ్ యాదవ్, మేడ శ్రీనివాస్, బాల్దె మల్లేశం, మోర్తాల ప్రభాకర్, పిట్టల సత్యం, జిల్లా సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

బడికి.. బంధుగణం

కొత్త టీచర్లలో పలువురు కుటుంబ సభ్యులు

- ఒకే ఇంట్లో ఇద్దరు, ముగ్గురికి ఉద్యోగాలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తుది జాబితా వెల్లడి
- నేడు హైదరాబాద్‌లో నియామకపత్రాల అందజేత
- ఉదయం 7 గంటలకే కలెక్టరేట్ వద్దకు రావాలని ఆదేశాలు



వారు ఒకే కుటుంబానికి చెందినవారు. సర్కారు కొలువు సాధించాలన్నది వారి ధ్యేయం. అనుకున్న లక్ష్యాన్ని చేరేందుకు కష్టపడ్డారు. ప్రణాళికాబద్ధంగా చదివారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో కొలువు కొట్టారు. మంగళవారం విడుదల చేసిన తుది జాబితాలో వారి పేర్లు చూసుకుని మురిసిపోయారు. ఇన్నాళ్లు పడిన కష్టాన్ని మరిచి పోయారు. ఇలా.. ఒకే ఇంట్లో టీచర్ ఉద్యోగా లు సాధించి.. పలువురికి ఆదర్శంగా నిలిచారు.

- విద్యారణ్యపురి/జనగామ/ మహబూబాబాద్ అర్బన్ /ములుగు/ భూపాలపల్లి అర్బన్ /కాళోజీ సెంటర్

మరికొంతమంది కుటుంబ సభ్యులపై 2లో కథనాలు

భార్యాభర్తలిద్దరూ ఉపాధ్యాయులే..



మరిపెడ రూరల్: డీఎస్సీ ఫలితాల్లో భార్యాభర్తలిద్దరూ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం రాంపురం గ్రామానికి చెందిన దంపతులు రాంపల్లి శ్రావణ్ కుమార్, చైతన్య ఎస్జీటీలుగా ఎంపికయ్యారు. వీరికి 2021లో వివాహం కాగా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చైతన్యది మండలంలోని తాళ్లఊకల్ గ్రామం కాగా.. పక్క గ్రామం తానంచర్ల హైస్కూల్‌లో 2012లో పదో తరగతి పూర్తి చేశారు. ఖమ్మంలో ఇంటర్, మరిపెడలో డిగ్రీ, ఖమ్మంలోని సెయింట్ లారెన్స్ కాలేజీలో టీటీసీ పూర్తి చేశారు. ఈక్రమంలో ఆమె 2020లో సివిల్ పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికై నర్సింహులపేట పోలీస్ స్టేషన్‌లో మొదటి పోస్టింగ్ చేపట్టారు. అనంతరం మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూనే డీఎస్సీకి ప్రిపేరై ఎస్జీటీ ఉద్యోగం సాధించారు. భర్త రాంపల్లి శ్రావణ్ కుమార్ స్వగ్రామం రాంపురం ప్రభుత్వ పాఠశాలలో 2011లో ఎస్సెస్సీ పూర్తి చేశారు. ఇంటర్, డిగ్రీ మరిపెడలో, టీటీసీ ఖమ్మంలోని సెయింట్ లారెన్స్ కాలేజీలో పూర్తి చేశారు. దంపతులిద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికవడంపై గ్రామస్తులు, బంధువులు అభినందించారు.

తల్లి కష్టం.. మేనమామ ప్రోద్బలం



గోవిందరావుపేట: తల్లి కష్టానికి తోడు మేనమామ ప్రోద్బలం అందించడంతో అక్కాచెల్లెల ముందు కష్టం చిన్నబోయింది. డీఎస్సీ తుది ఫలితాల్లో ఇద్దరు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలిచారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రానికి చెందిన బండ లావణ్య, రవీందర్‌రెడ్డి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. పెద్ద కుమార్తె చందన, రెండో కుమార్తె మానస చదువులో చిన్నప్పటి నుంచే ప్రతిభ కనబర్చేవారు. కుమార్తెలు ఇంటర్మీడియెట్ చదువుతుండగా తండ్రి రవీందర్ అనారోగ్యంతో చనిపోవడంతో తల్లి లావణ్య రోజు వారీగా కూలికి పోతూ పిల్లలను చదివించింది. ఇటీవల నిర్వహించిన డీఎస్సీ 2024లో ఎస్జీటీ ఉద్యోగాలు సాధించడంతో తల్లి లావణ్య కళ్లలో ఆనందం ఉప్పొంగింది. మేన మామ ఎర్రవెల్లి రాజిరెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉండడంతో ఆయన గైడెన్స్‌లో ఇద్దరు అక్కాచెల్లెళ్లు సొంతగా డీఎస్సీకి ప్రిపేరై ఉద్యోగాలు సాధించారు.

నేడు హైదరాబాద్‌కు..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా టీజీ డీఎస్సీ -2024 తుది జాబితాను ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులు మంగళవారం అధికారికంగా వెల్లడించారు. టీచర్లుగా ఎంపికైన వారికి ఫోన్ ద్వారా అధికారికంగా సమాచారం అందించారు. వారికి ప్రత్యేకంగా ఐడీ కార్డులు అందజేశారు. వీరందరినీ ఆర్టీసీ బస్సుల్లో హైదరాబాద్‌లో బుధవారం జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సభకు తరలించనున్నారు. అభ్యర్థులు ఆయా జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్లకు ఉదయం 7 గంటల వరకు రావాల్సి ఉంటుంది. మధ్యలో హోటల్‌లో వీరికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ఎల్‌బీ స్టేడియానికి చేరుకుంటారు. వీరివెంట బస్సుల్లో ఒక పోలీస్, వైద్య ఆరోగ్యసిబ్బంది ఒకరు, పీజీ హెచ్‌ఎం, విద్యాశాఖ సిబ్బంది ఒకరిద్దరు ఉంటారు. ఎంపికైన అభ్యర్థులు విద్యాశాఖ డైరెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఓ ప్రొఫార్మా ప్రకారం నియామక ఉత్తర్వులు తీసుకెళ్తారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జిల్లాల వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి నియామకపత్రాలు అందిస్తారు.

మిగిలిన పోస్టులు ఇలా..

ఒక్కో పోస్టుకు 1:3 చొప్పున అభ్యర్థులను సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలిచిన అధికారులు వివిధ కారణాలతో తిరస్కరించడంతో పలు పోస్టులు ఖాళీగా మిగిలాయి.

- హనుమకొండ జిల్లాలో 18 పోస్టులు మిగిలాయి. ఎస్జీటీ కేటగిరీలో ఉర్దూ మీడియంలో ఐదు, తెలుగు మీడియంలో ఒక పోస్టు, స్పెషల్ ఎడ్యుకేషన్‌లో 12 పోస్టులను భర్తీ చేయలేదు.
- జనగామ జిల్లాలో ఫిజికల్ ఎడ్యుకేషన్, బీసీ (ఏ), స్పెషల్ ఎడ్యుకేషన్ తదితర విభాగాల్లో అర్హత కలిగిన వారు లేకపోవడంతో 22 పోస్టులు ఖాళీగా మిగిలిపోయాయి.
- మహబూబాబాద్ జిల్లాలో ఎస్జీటీ ప్రత్యేక విద్య 5, ఎస్జీటీ తెలుగు–7, ఎస్ఏ మ్యాథ్స్, సైన్స్ ఒక్కోటి చొప్పున ఖాళీగా ఉండిపోయాయి.
- ములుగు జిల్లాలో లాంగ్వేజ్ పండిట్, ఎస్ఏ ఇంగ్లిష్‌లో ఒక్కోటి చొప్పున, ఎస్జీటీ ప్రత్యేక విద్య 9, ఎస్జీటీలో 3 పోస్టులు మిగిలాయి.
- జయశంకర్ భూపాలపల్లిలో ఎస్జీటీ ప్రత్యేక విద్య –13, ఎస్ఏ ప్రత్యేక విద్య–4, ఎస్జీటీ5, ఎస్ఏ 3 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- వరంగల్ జిల్లాలో 29 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఎస్జీటీలుగా అన్నాచెల్లెలు



కొడకండ్ల: పేదరికం వెంటాడినా వెరవలేదు. స్నేహితులంతా కోచింగ్ సెంటర్లకు పరుగులు పెట్టినా పట్టు వీడలేదు. ఇంటి వద్దే కష్టపడి చదివి ఎస్జీటీలుగా ఎంపికయ్యారు కొడకండ్ల మండల కేంద్రానికి చెందిన అన్నాచెల్లెలు కొక్కుల రాజశేఖర్, లావణ్య. పేద చేనేత కుటుంబానికి చెందిన కొక్కుల సోమయ్య–సరస్వతి దంపతుల సంతానం రాజశేఖర్, లావణ్య. వీరు పదో తరగతి వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలోనే విద్యనభ్యసించారు. అనంతరం తొర్రూరులో 2015లో రాజశేఖర్, 2018లో లావణ్య డీఈడీ పూర్తి చేశారు. అప్పటి నుంచి డీఎస్సీ అవకాశం రాకపోగా ఈసారి ఎలాగైనా జాబ్ కొట్టాలని ఇంటివద్దే కష్టపడి చదివి తొలి ప్రయత్నంలోనే ఇద్దరు ఎస్జీటీలుగా ఎంపికయ్యారు. పేద చేనేత కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. పిల్లలిద్దరూ ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికవడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

బాబాయి అబ్బాయి..




తలుగు ప్రవీణ్‌కుమార్, సుధాకర్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం బొమ్మాపూర్ గ్రామానికి చెందిన తలుగు వరలక్ష్మి–వెంకటస్వామి కుమారుడు తలుగు ప్రవీణ్ ఎస్జీటీ కొలువు సాధించారు. అలాగే, వెంకటస్వామి సోదరుడు తలుగు సుధాకర్ తెలుగు లాంగ్వేజ్ పండిట్ ఉద్యోగం సాధించడంతో కుటుంబ సభ్యులు ఆనందంలో మునిగిపోయారు. ఒకే కుటుంబంలో ఇద్దరికి టీచర్ ఉద్యోగాలు రావడంతో పలువురు అభినందిస్తున్నారు.

ఆ నలుగురు.. సమీప బంధువులు



హసన్‌పర్తి: వారిది ఒకే ఊరు.. ఒకే వీధి. ఒకే సామాజిక వర్గం.. అందరూ సమీప బంధువులే. కలిసి చదువుకుని కొలువులు సాధించారు. హసన్‌పర్తి మండలం సిద్ధాపురం గ్రామానికి చెందిన వల్లాల నర్మద, తాబేటి హరీశ్‌గౌడ్, వంగ విక్రమ్‌గౌడ్, దూలం శ్రవణ్‌కాంత్ గౌడ్ కలిసి డీఎస్సీకి ప్రిపేరయ్యారు. మెరిట్ సాధించి ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. నర్మద (ఎస్ఏ బయాలజీ), తాబేటి హరీశ్ (పీఈటీ), వంగ విక్రమ్ (ఎస్జీటీ), దూలం శ్రవణ్‌కాంత్‌గౌడ్ (ఎస్జీటీ)గా ఉద్యోగాలు సాధించారు. ఉద్యోగాలు సాధించడం ఆనందంగా ఉందని వారు తెలిపారు.

జిల్లాల వారీగా పోస్టుల భర్తీ.. ఖాళీలు ఇలా..

జిల్లా	పోస్టులు	ఎంపికైంది	మిగిలిన పోస్టులు
హనుమకొండ	187	169	18
వరంగల్	301	272	29
జనగామ	221	199	22
మహబూబాబాద్	376	362	14
ములుగు	192	178	14
జేఎస్ భూపాలపల్లి	237	212	25

సర్వేను వేగవంతం చేయాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: భూముల లేఔట్ క్రమబద్ధీకరణ, సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి (కుడా) పరిధి చిల్పూరు, ఘన్‌పూర్ (స్టేషన్), జఫర్‌ఘడ్ మండలాల ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల సర్వే ప్రక్రియపై తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, రెవెన్యూ, నీటి పారుదల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'కుడా' పరిధి ఈ మూడు మండలాల నుంచి మొత్తం 7,433 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో భాగంగా 633 సర్వే ప్రక్రియ పూర్తయ్యిందని పేర్కొన్నారు. పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. గ్రామాలు, మండలాల వారీగా ట్రాకింగ్ షీట్ ఏర్పాటు చేసుకోవాలని, మండల స్థాయిలో యాక్షన్ ప్లాన్‌ను రూపొందించుకోవాలని, సర్వే నంబర్ల వారీగా ఈప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సూచించారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో ఈడీఎం గౌతమ్‌రెడ్డి, మూడు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, రెవెన్యూ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలపై 'విజిలెన్స్' విచారణ

సాక్షి ఎఫెక్ట్




బచ్చన్నపేట పీఏసీఎస్‌లో విచారణ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

బచ్చన్నపేట: బచ్చన్నపేట మండల కేంద్రంలోని పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం)లో అక్రమాలు జరిగాయనే ఫిర్యాదు మేరకు మంగళవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలపై ఇటీవల సాక్షిలో ప్రచురితమైన వరుస కథనాలతో ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ విజిలెన్స్ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. సహకార సొసైటీకి చెందిన విజిలెన్స్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎఫ్‌ఆర్‌ఓ గౌతమ్ బృందం ఉదయం నుంచి సాయంత్రం 10 గంటల పాటు రికార్డుల తనిఖీలు చేపట్టారు. అనంతరం పీఏసీఎస్‌లో రుణాలు 2020–21 యాసంగి సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యంలో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు రైతులను పిలిపించి వాగ్మూలం తీసుకున్నారు. పట్టేదారు పాస్‌బుక్ లేకున్నా ధాన్యం అమ్మకాలు, కొనుగోలు చేసినట్లు చూపిస్తూ వారి పేరిట డబ్బులను బ్యాంకు ఖాతాలో డబ్బుల జమ, సదరు రైతులు అమ్మిన దానికంటే అదనంగా ధాన్యం కొనుగోలు చేసినట్లు చూపించారనే దానిపై–విచారణ జరిపారు. పీఏసీఎస్‌లో రైతులు తీసుకున్న పంట రుణాలకు సంబంధించి సరైన పత్రాలున్నాయా? సీఎంఆర్ కింద రైస్ మిల్లులకు పంపించిన లెక్కల్లో తేడాలు? తనిఖీ చేశారు. సాయంత్రం వరకు ఆయా గ్రామాల రైతులతో విజిలెన్స్ అధికారులు మాట్లాడారు. కాగా.. బచ్చన్నపేట పీఏసీఎస్‌లో తనిఖీ చేసిన నివేదికలను ఉన్నతాధికారులకు పంపించనున్నారు. ఇదిలా ఉండగా.. పీఏసీఎస్‌లో రూ.2.50 కోట్ల మేర అవకతవకలు జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. విచారణ అనంతరం అక్రమాలు వెలుగు చూడనున్నాయి.

2.67 లక్షల మెట్రిక్ టన్నులు

జిల్లాలో కొనుగోలు చేయనున్న ధాన్యం

- సన్నాలకు రూ.500 బోనస్
- 180 కొనుగోలు కేంద్రాలు
- సన్న ధాన్యానికి ప్రత్యేకంగా 116 సెంటర్లు
- గుర్తింపునకు యంత్రాలు
- ఈ నెల 20 వరకు ప్రారంభం



జనగామ: జిల్లాలో వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లకు సర్వం సిద్ధం చేస్తున్నారు. దొడ్డు, సన్నరకం ధాన్యం వేర్వేరుగా కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2024–25 సీజన్‌లో 2 లక్షల 67 వేల 178 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. ఇందుకు సంబంధించి ఐకేపీ, పీఏసీఎస్, హాకా ఆధ్వర్యంలో దొడ్డు రకం 180, సన్నరకం 116 సెంటర్లను వేర్వేరుగా ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 94 ఐకేపీ, 84 పీఏసీఎస్, 2 హాకా శాఖల పర్యవేక్షణలో ధాన్యం కొనుగోలు చేయనుండగా.. సన్నరకం 11 సెంటర్లను ఏయే శాఖకు అప్పగిస్తారనే విషయం తెలియాల్సి ఉంది.

ఎంఎస్‌పీ క్వింటాకు రూ.2,300

వానాకాలం సీజన్ నుంచి ధాన్యం క్వింటాకు ఎంఎస్పీ కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. 17 శాతం తేమ ఉన్న ఏ గ్రేడ్ ధర రూ.2,220, కామన్ రూ.23 వందలకు పెరిగింది. సన్నరకం ధాన్యానికి ప్రస్తుత ఎంఎస్‌పీ ధరకు.. రూ.500 బోనస్‌గా ఇవ్వనున్నారు. జిల్లాలో 2.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేయగా.. 58 వేల మెట్రిక్ టన్నుల వరకు సన్నరకం ధాన్యం వస్తుందని భావిస్తున్నారు. సన్నరకం క్వింటాకు రూ.5 వందల బోనస్ ఇవ్వనుండగా.. దొడ్డు రకానికి సైతం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకానికి వేర్వేరుగా రికార్డులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. రిజిస్టర్లలో రైతు పేరు, ఫోన్ నంబర్, సమయం, స్థలం, రైతు సంతకం తప్పనిసరిగా తీసుకోవాలనే నిబంధన విధించారు. ప్రతీ కేంద్రానికి దొడ్డు రకానికి జేఎస్ (సీ–కోర్సు) 1, 2, 3, 4, సన్న రకానికి జేఎస్ (ఎస్–సన్నాలు) 1, 2, 3, 4 అనే కోడ్ నంబర్లను ప్రతీ బస్తాపై కేటాయించాలని కలెక్టర్ సూచించారు. దొడ్డు రకం బస్తాకు పచ్చ దారం, సన్న రకానికి ఎర్ర దారంతో సీల్ చేసేలా వ్యవసాయ శాఖ ఏఈఓలు పర్యవేక్షించాల్సి ఉంటుంది. రూ.5 వందల బోనస్‌పై అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవంటూ కలెక్టర్ హెచ్చరికలను జారీ చేశారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ఓపీఎంఎస్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

గన్నీ బ్యాగులు.. టార్పాలిన్ కవర్ల కొనుగోళ్లు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు 17 లక్షల గన్నీ బ్యాగులు అవసరముండగా, ప్రస్తుతం 51 లక్షలు అందుబాటులో ఉన్నాయి. 63 వందల వరకు టార్పాలిన్ కవర్లు అవసరమని నివేదికలను తయారు చేయగా.. 2,950 కవర్లు సిద్ధంగా ఉన్నాయి. 360 ఎలక్ట్రానిక్ కాంటాలు అవసరమున్న నేపథ్యంలో 187 ఐకేపీ, పీఏసీఎస్ శాఖల వద్ద ఉన్నాయి. తేమ యంత్రాలు 360కి గాను 166 ఉండగా.. సెంటర్ల పరిధిలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా తక్కువగా ఉన్న వాటిని కొనుగోలు చేయనున్నారు. ఇదిలా ఉండగా సన్నరకం ధాన్యం గుర్తింపు కోసం గ్రెయిన్ క్యాలిపర్స్, హస్క్ రిమూవర్ అనే యంత్రాలను కొత్తగా కొనుగోలు చేసేందుకు ప్రతిపాదనలు పంపించారు. వర్షాలు కురిస్తే సెంటర్లలో ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను కోరారు.

అధికారులతో కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జిల్లాలో వానాకాలం సీజన్ వరి ధాన్యం (సన్న, దొడ్డు రకం) కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్ సింగ్‌తో కలిసి కలెక్టర్ ధాన్యం కొనుగోళ్లపై ఏఈఓలు, డీపీఎంలు, ఏపీఎంలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, కమ్యూనిటీ కో–ఆర్డినేటర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 2.67 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. ఇందులో 55 వేల మెట్రిక్ టన్నుల వరకు సన్న రకం వరి ధాన్యం రానున్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలో 180 దొడ్డు రకం, 116 సన్న రకం ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బోనస్ డబ్బులు 48 గంటల్లోగా..

రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారిగా సన్నరకం ధాన్యంపై కింటాకు రూ.500 బోనస్ ఇస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. బోనస్ డబ్బులు 48 గంటల్లోగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తారని, సన్నాలకు సంబంధించి రూ.500 బోనస్‌పై అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, డయల్ గ్రెయిన్ క్యాలిబర్‌లు, టోకెన్ల జారీ, వేయింగ్ మెషిన్స్, ప్యాడీ క్లీనర్‌లు, తదితరాల వాటికి సంబంధించి కొరత రాకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీఓ వసంత, డీసీఎస్‌ఓ సరస్వతి, డీఏఓ రామారావు నాయక్, డీఎం సీఎస్ హతీరాం, ఇతర సంబంధిత అధికారులు, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

పంట పరిహారం విడుదల

జనగామ: జనగామ జిల్లాలో ఈ ఏడాది ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 6వ తేదీ వరకు కురిసిన వర్షాలతో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం మంగళవారం పరిహారం విడుదల చేసింది. జిల్లాలోని కొడకండ్ల, పాలకుర్తి, నర్మెట, తరిగొప్పుల నాలుగు మండలాల పరిధిలో 46 మంది రైతులకు చెందిన 67.36 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు నివేదికలను పంపించారు. దీంతో ఎకరాకు రూ.10 వేల చొప్పున రూ.6.79 లక్షలు విడుదల చేశారు. పరిహారం బాధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది.

'ఔట్ సోర్సింగ్' దరఖాస్తుల స్క్రూటినీ

జనగామ: జనగామ మెడికల్ కళాశాల పరిధిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల కోసం అభ్యర్థుల నుంచి స్వీకరించిన దరఖాస్తులకు సంబంధించి స్క్రూటినీ జరుగుతోందని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొవిజనల్ మెరిట్ జాబితా దసరా పండుగ తర్వాత విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్న నేపథ్యంలో కొంత ఆలస్యం జరుగుతున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేడు జాబ్ మేళా

హన్మకొండ అర్బన్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులకు నేడు (బుధవారం) నగరంలోని ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా ఉపాధి కల్పన అధికారి, ఉమ్మడి వరంగల్ జిల్లా నోడల్ అధికారి ఎం.మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 'భారత్ ఫైనాన్సియల్ ఇన్‌లూషన్ లిమిటెడ్' కంపెనీలో లోన్ ఆఫీసర్లుగా పనిచేసేందుకు 50 మంది అభ్యర్థులను ఎంపిక చేసేందుకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు 18 నుంచి 28 సంవత్సరాలు ఉండి ఇంటర్ లేదా ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, టూ వీలర్, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉదయం 11 గంటల వరకు హాజరుకావాలని వివరించారు. వివరాలకు 78933 94393 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బైక్ చోరీ కేసులో వ్యక్తికి 9 నెలల జైలు

జనగామ: జనగామ పట్టణం బాలాజీనగర్‌లో 2023 ఆగస్టు 15వ తేదీన ద్విచక్రవాహనం చోరీకి పాల్పడిన ఘటనలో ఓ వ్యక్తికి 9 నెలల జైలు శిక్ష, రూ. వంద జరిమానా విధిస్తూ జనగామ కోర్టు జేఎఫ్‌సీఎం జడ్జి ఈ.సుచిత్ర మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. బాలాజీనగర్‌కు చెందిన వ్యాపారి లోనె మధు మోహన్‌జీ 2023లో కుటుంబ సమేతంగా దైవదర్శనం కోసం తిరుపతికి వెళ్లారు. 19వ తేదీన ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో కాలనీ వాసులు సమాచారం అందించారు. 19వ తేదీ రాత్రి ఇంటికి చేరుకుని లోపలకు వెళ్లి చూడగా బెడ్‌రూంలో దుస్తులు చిందరవందరగా చేసి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. ఇంటి ఆవరణలో పార్క్ చేసిన బైక్ కనిపించకపోవడంతో ఎత్తుకెళ్లినట్లు భావించి పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై అరుణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడిన నల్లగొండ జిల్లా చండూరు మండలం నర్మెట గ్రామానికి చెందిన నారపాక దశరథను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు కానిస్టేబుల్ తాటి రవికుమార్ సాక్షులను ప్రవేశపెట్టగా వాదోపవాదాలు విన్న జడ్జి ఈ.సుచిత్ర.. దశరథకు 9 నెలల జైలు శిక్ష విధించినట్లు సీఐ దామోదర్‌రెడ్డి తెలిపారు. పీపీ ఎం.రవికుమార్ తదితరులు ఉన్నారు.

ముగిసిన అథ్లెటిక్స్ పోటీలు



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగిన 10వ తెలంగాణ రాష్ట్ర జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మంగళవారం ముగిసింది. ముగింపు వేడుకలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్, పారా ఒలింపిక్స్ కాంస్య విజేత దీప్తి జీవాంజీ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ప్రతిభకు పేదరికం అడ్డుకాదని దీప్తి నిరూపించిందని రమేశ్ అన్నారు. కోచ్‌ల పర్యవేక్షణలో నిత్యసాధనతోనే ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించానని దీప్తి అన్నారు. కార్యక్రమంలో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టు మహేశ్‌బాబు, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు, టెక్నికల్ అఫిషియల్స్, కోచ్‌లు పాల్గొన్నారు.

భవానిదేవిగా రుద్రేశ్వరి అమ్మవారు..



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎంపీ కడియం కావ్య

హన్మకొండ కల్చరల్ : రుద్రేశ్వర స్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం రుద్రేశ్వరి అమ్మవారు భవానిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, రుద్రార్చనలు జరిగాయి. రుద్రేశ్వరి ఉత్సవమూర్తికి కాత్యాయని దుర్గార్చన జరిపిన అనంతరం ఉత్సవమూర్తిని భవానిదేవిగా అలంకరించి పల్లకీసేవ నిర్వహించారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య అమ్మవారికి గాజులు సమర్పించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వేయిస్తంభాల ఆలయంలో అభివృద్ధి కార్యక్రమాలు, పూర్తిస్థాయిలో గార్డెన్ సుందరీకరణ చేయాల్సిన అవసరం ఉందని, దీని కోసం కేంద్ర టూరిజం శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో మాట్లాడి నిధులు సమకూరేలా కృషి చేస్తానన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పరమేశ్వర్ శిష్య బృంద భరతనాట్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ఆలయ ఈఓ వెంకటయ్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భద్రకాళి అమ్మవారికి పూర్ణాభిషేకం..



అమ్మవారి స్నపనమూర్తికి గంధోత్సవం

హన్మకొండ కల్చరల్ : భద్రకాళి దేవాలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం భద్రకాళి అమ్మవారు భవానిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు అమ్మవారి మూలమూర్తికి ఉదయం పూర్ణాభిషేకం, నిత్యాహ్నికం నిర్వహించి గజమాలలతో అలంకరించారు. అమ్మవారి స్నపనమూర్తిని కాత్యాయని క్రమంలో పూజలు నిర్వహించి గంధోత్సవం నిర్వహించారు. సాయంత్రం చండముండహ క్రమంలో అర్చన నిర్వహించి సాలభంజిక సేవ నిర్వహించారు. వరంగల్ మేయర్ గుండు సుధారాణి.. అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి తెప్పోత్సవం సందర్భంగా భద్రకాళి చెరువును పరిశీలించారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ ఈఓ శేషుభారతి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కాత్యాయని అలంకరణలో భ్రమరాంబిక



కాత్యాయని అలంకరణలో భ్రమరాంబిక అమ్మవారు

ఐనవోలు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో భ్రమరాంబిక అమ్మవారు కాత్యాయని మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో నవశక్త్యార్చన, దుర్గా సూక్త పారాయణం, లలిత ఖడ్గ మాల అష్టోత్తర శతనామార్చన, త్రిశతి, శ్రీచక్రార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి అలంకరణలను భక్తులు పెద్దసంఖ్యలో హాజరై దర్శించుకోవాలని ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు కోరారు. కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకులు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్ శర్మ, వేద పండితులు విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు నందనం భానుప్రసాద్‌శర్మ, పాతర్లపాటి నరేశ్‌శర్మ, నందనం మధుశర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ 'బంధువులు'



రాత్రి, పగలు అనే తేడా లేదు. ఆకలి, నిద్రాహారాల ఊసే లేదు. ఉన్నది ఒక్కటే లక్ష్యం. ఉపాధ్యాయ కొలువు సాధించడం. ఇదే శ్వాస.. ఇదే ధ్యాస. నిత్యం పుస్తకాలతో దోస్తీ.. ప్రశ్నలతో కుస్తీ పట్టారు. కఠోర తపస్సు చేశారు. పోటీలో వేలాది మందిని తట్టుకుని లక్ష్యం చేరుకున్నారు. చివరకు పంతుళ్లు (స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ) అయ్యారు. ఈ ఉద్యోగాలు సాధించిన వారిలో సొంత అన్నాతమ్ముళ్లు, అక్కాచెల్లెలు, అన్నాచెల్లెలు, బావబామ్మర్దులు ఉన్నారు. ఉద్యోగ సాధనలో ఎన్నో ఆటంకాలు, మరెన్నో సవాళ్లు ఎదురైనా మొక్కవోని దీక్షతో సన్నద్ధమై విజయతీరాలకు చేరారు. వీరి విజయగాథపై 'సాక్షి' ప్రత్యేక కథనం

ఒకే కుటుంబంలో ఇద్దరికి కొలువులు ..



స్వాతి మమత

దంతాలపల్లి: మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం రాయానుజపురం గ్రామానికి చెందిన అన్నదమ్ముల పిల్లలు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ధర్మారపు ఉప్పలయ్య, ధర్మారపు రామయ్య అన్నదమ్ములు. వారి పిల్లలు స్వాతి, మమత ఎస్‌జీటీ ఉద్యోగాలు సాధించారు. దీంతో అన్నదమ్ముల కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నిర్వహించిన డీఎస్సీలో ఉప్పలయ్య, రామయ్య మరో ఇద్దరి అన్నదమ్ముల పిల్లలు ఉపాధ్యాయ కొలువులు సాధించారు. కాగా, ఉమ్మడి కుటుంబంలోని నలుగురు అన్నదమ్ముల పిల్లలు ఉపాధ్యాయులు కావడం విశేషం.

అన్నదమ్ముళ్లు ఇక పంతుళ్లు..



శివకుమార్ రాజు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన అన్నదమ్ముళ్లు పసునూరి రాజు, శివకుమార్ ఉపాధ్యాయ కొలువులు సాధించారు. వీరిది వ్యవసాయ ఆధారిత కుటుంబం. చిన్నప్పటి నుంచి కష్టపడి చదివారు. 2019లో రాజు, శివకుమార్ జేపీఎస్ (జూనియర్ పంచాయతీ సెక్రటరీ) ఉద్యోగాలు సాధించారు. రాజు ప్రస్తుతం పాలకుర్తి మండలం కిష్టాపురం తండా కార్యదర్శిగా పని చేస్తున్నారు. శివకుమార్ రఘునాథపల్లి మండలం కుసుంబాయి తండా కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. జీపీ కార్యదర్శులుగా పని చేస్తూనే డీఎస్సీకి సన్నద్ధమై ఎస్‌జీటీ ఉద్యోగాలు సాధించారు.

ఉపాధ్యాయులుగా అన్నాచెల్లెలు..



రమేశ్, స్వాతి

మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ జిల్లా కురవి మండలం రాజోలు గ్రామానికి చెందిన బసనబోయిన దర్గయ్య–ఉపేంద్రమ్మ దంపతుల కుమారుడు రమేశ్, కుమార్తె స్వాతి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు. దుర్గయ్య వ్యవసాయం చేసుకుంటూ పిల్లలను చదివించాడు. కాగా, ఆయన పెద్ద కూతురు రమాదేవి 2009 డీఎస్సీలో ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. అక్కను స్ఫూర్తిగా తీసుకొని తమ్ముడు రమేశ్, చెల్లి స్వాతి కష్టపడి చదివి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు.

తల్లిదండ్రుల పట్టుదలతో..



శ్రీజ

వెన్నెల

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రెడ్డికాలనీకి చెందిన మధురకవి రాములు ఇద్దరు కుమార్తెలు వెన్నెల, శ్రీజ ఎస్‌జీటీ ఉద్యోగాలు సాధించారు. ఇద్దరు కుమార్తెలకు వివాహాలు జరిగిన తర్వాత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ప్రోత్సహించడంతో ఉద్యోగాలు సాధించారు.

అన్నాచెల్లికి టీచర్ నౌకర్లు..



మహేశ్‌కుమార్, మౌనిక

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన అన్నాచెల్లెలు బళ్ల మహేశ్‌కుమార్, మౌనిక ఎస్‌జీటీ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఒకే ఇంట్లో ఇద్దరికీ ప్రభుత్వ ఉద్యోగాలు రావడంతో గ్రామస్తులు వారిని అభినందించారు.

అన్నదమ్ములకు ఉద్యోగాలు..



బాపిరాజు, శ్రీనివాస్

నర్మెట: మండల కేంద్రానికి చెందిన కొన్నె కనకమ్మ, వెంకటయ్య దంపతుల కుమారులు బాపిరాజు, శ్రీనివాస్ ఎస్‌జీటీలుగా ఎంపికయ్యారు. పేద కుటుంబానికి చెందిన వీరు ఉద్యోగం సాధించడంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు అభినందించారు.

అక్కతో పోటీ పడి..



మమత, అనిత

భూపాలపల్లి అర్బన్: మల్హర్ మండలంలోని అన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన గుగులోత్ రాజునాయక్ కుమార్తెలు మమత, వినీత ఎస్‌జీటీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. డీఎస్సీ ప్రకటన రావడంతో ఇద్దరు ఒకే దగ్గర చదువుకున్నారు. అక్కాచెల్లెలు మధ్య 8 ఏళ్ల వయస్సు వ్యత్యాసం ఉన్నప్పటికీ చెల్లి.. అక్కతో పోటీ పడి చదివి ఉద్యోగం సాధించింది.

ఒకే ఇంట్లో ఇద్దరు..



పైడాకుల సాగర్ పైడాకుల సందీప్

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని ముప్పనపల్లికి చెందిన పైడాకుల సమ్మయ్య, జానకీ దంపతుల కుమారులు పైడాకుల సందీప్, సాగర్ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు. ఒకే కుటుంబంలో అన్నదమ్ములు ఎస్‌జీటీ ఉద్యోగాలు సాధించడంపై గ్రామస్తులతోపాటు బంధువులు వారిని అభినందించారు.

పట్టుదలకు తలొంచిన అంధత్వం..

- టీచర్ కొలువు సాధించిన డీఈఓ కార్యాలయ అటెండర్ వరప్రసాద్
- పుట్టుకతోనే నేత్ర సమస్యలు..
- మొక్కవోని ధైర్యంతో ముందుకు..



వరప్రసాద్

జనగామ: పట్టుదలకు అంధత్వం తలొంచింది. పుట్టుకతోనే నేత్ర సమస్యలు ఉన్నా... తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కష్టపడి చదువుకుంటూ ఎంఏ, బీఈడీ పూర్తి చేశారు జనగామ గోకుల్‌నగర్‌కు చెందిన అరకాల హన్మంతారావు, శోభారాణి మొదటి కుమారుడు వరప్రసాద్. 2019లో ఆఫీస్ సబార్డినేట్(ఓఎస్)గా ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వరప్రసాద్.. 317 జీఓలో బదిలీపై జనగామ డీఈఓ కార్యాలయానికి వచ్చారు. ఉద్యోగం ఉన్నా.. మొక్కవోని ధైర్యం, సంకల్పంతో ప్రిపరేషన్ అయి టెట్‌లో 104 మార్కులు సాధించి డీఎస్సీకి అర్హత సాధించారు. డీఎస్సీ–2024లో పరీక్ష రాసి 50 మార్కులతో స్కూల్ అసిస్టెంట్ (సోషల్) పోస్టు సాధించారు. దీంతో మంగళవారం డీఈఓ రామ్, అధికారులు రమేశ్, శ్రీనివాస్, తోట రాజు, తెలంగాణ నాన్ గెజిటెడ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఫోరం జిల్లా కార్యదర్శి ఎండీ. నూరొద్దీన్, సహచర ఉద్యోగులు అరుణ్, శ్రీధర్ తదితరులు వరప్రసాద్‌ను అభినందించారు. కాగా, వరప్రసాద్‌కు అద్దాల ద్వారా కొంతమేర చూపు కనిపిస్తుంది.

ఉపాధ్యాయులుగా బావబామ్మర్దులు..



ఐలి వీరేందర్ కొత్త కరుణాకర్

కురవి: బావ బామ్మర్దులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మోద్గులగూడెం గ్రామానికి చెందిన ఐలి వీరేందర్(బావ), కొత్త కరుణాకర్(బావమరిది) 2024 డీఎస్సీ ఫలితాల్లో ఎస్‌జీటీ పోస్టులు దక్కించుకున్నారు. ఐలి వీరేందర్ 18వ ర్యాంకు సాధించగా.. కొత్త కరుణాకర్ 66వ ర్యాంకు సాధించాడు. వీరిద్దరు 2017 డీఎస్సీ రాసినప్పటికీ ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోస్టులు లేకపోవడంతో నిరాశచెందారు. అయినా పట్టువదలకుండా కష్టపడి చదివి ప్రస్తుతం ఉద్యోగాలు సాధించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కష్టానికి తగిన ఫలితం వచ్చిందని, ఆనందంగా ఉందని తెలిపారు.

డ్యూటీ మీట్ పోటీలతో వృత్తిలో నైపుణ్యం

- సీపీ అంబర్ కిషోర్ ఝా



సీపీ అంబర్ కిషోర్ ఝాతో పతకాలు సాధించిన పోలీస్ అధికారులు

వరంగల్ క్రైం : డ్యూటీ మీట్ పోటీల్లో పాల్గొనడం వల్ల పోలీస్ అధికారులు తమ వృత్తిలో మరింత మెరుగుగా రాణించగలరని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. వరంగల్ పోలీస్ పరేడ్ మైదానంలో ఈనెల 3వ తేదీ నుంచి మూడు రోజుల పాటు భద్రాద్రి జోనల్ పరిధిలోని వరంగల్ కమిషనరేట్, ఖమ్మం కమిషనరేట్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులకు నిర్వహించిన జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో గెలుపొందిన పలువురు పోలీస్ అధికారులకు సీపీ అంబర్ కిషోర్ ఝా చేతుల మీదుగా మంగళవారం పతకాలు బహూకరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు వృత్తిలో నైపుణ్యం సాధించడం ద్వారా నేరస్తులను గుర్తించడంతో పాటు వారికి శిక్షలు పడి బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేశ్‌కుమార్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్ర, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం



రాములు మృతదేహం

తరిగొప్పుల : రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై అయ్యాల శ్వేత కథనం ప్రకారం.. మండలంలోని అక్కరాజుపల్లికి చెందిన గొలుసుల రాములు(68) మంగళవారం మండల కేంద్రంలోని వారాంతపు సంతకు వెళ్లాడు. తిరిగి తన ద్విచక్రవాహనంపై స్వగ్రామం వస్తున్నాడు. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన నారోజు విక్రమ్ బైక్‌పై మండల కేంద్రానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అక్కరాజుపల్లిలో వీరి బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో రాములు మృతిచెందాడు. విక్రమ్‌ను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ప్రణాళిక

- రైతులకు మేలు చేసేలా సాగుకు సోలార్ పంపుసెట్లు
- పొలం బాట ద్వారా విద్యుత్ సమస్యల పరిష్కారం
- ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, పక్కన ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని 2029–2030 వరకు 20వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఖమ్మంలో కలెక్టరేట్‌లో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల విద్యుత్ అధికారులతో శాఖ పనితీరుపై, ఎన్పీడీసీఎల్ సీఎండీ కె.వరుణ్‌రెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ రోజురోజుకు విద్యుత్ వినియోగం పెరుగుతున్న దృష్ట్యా వ్యవస్థను పటిష్టపరచడానికి కావాల్సిన బడ్జెట్ కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడకుండా అదనంగా ఏర్పాటుచేస్తామని చెప్పారు.

తలసరి ఆదాయం పెరుగుదలలో కీలకపాత్ర

వ్యవసాయానికి ఇప్పటికే ఉచిత విద్యుత్ అందిస్తున్నామని.. రైతుల పంపుసెట్లకు కావాల్సిన విద్యుత్ అందిస్తూనే ఆదాయం సమకూరేలా సోలార్ విద్యుత్ యూనిట్లు ఇస్తామని భట్టి తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద మధిర మండలం సిరిపురాన్ని ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ గ్రామంలోని ఇళ్లకు కూడా సోలార్ ప్యానళ్లు బిగించి పూర్తిస్థాయి సౌర విద్యుత్ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇక కొడంగల్, అచ్చంపేటల్లో కూడా సౌర విద్యుదీకరణ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, తలసరి ఆదాయం పెరిగేలా నాణ్యమైన కరెంట్ అందించడంలో కీలకమైన పాత్ర విద్యుత్ శాఖదేనని వెల్లడించారు. కాగా, విద్యుత్ వినియోగం ఎంత ఉన్నా అందించేలా ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఇటీవల వరదల సమయాన అర్ధరాత్రి సైతం పనిచేసిన విద్యుత్ ఉద్యోగులంతా అభినందనీయులన్నారు.

పొలంబాటతో విద్యుత్ సమస్యల పరిష్కారం..

రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సంబంధిత సమస్యల తెలుసుకుని పరిష్కరించేందుకు పొలంబాట కార్యక్రమం ఉపయోగపడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. అలాగే, ట్రాన్స్‌ఫార్మర్ల షెడ్లను తనిఖీ చేయాలని, లైన్‌మెన్లు ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించేలా అవగాహన కల్పించాలని చెప్పారు. విద్యుత్ శాఖలో పదోన్నతులు కల్పించగా, త్వరలో ఖాళీ పోస్టులు భర్తీ చేస్తామని, విద్యుత్ ఉద్యోగుల పిల్లల సంక్షేమానికి పథకం ప్రవేశపెడతామని తెలిపారు. కాగా, విద్యుత్ సంబంధిత ఫిర్యాదులపై 1912కి ఫోన్ చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

వరదలతో రూ.30 కోట్లు నష్టం

ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల భారీ వర్షాలు, వరదలతో విద్యుత్ శాఖకు రూ. 30 కోట్ల నష్టం వాటిల్లిందని తెలిపారు. రాత్రింబవళ్లు యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేశామని చెప్పారు. ఓవర్ లోడ్ ఉన్న చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు బిగిస్తూ, అవసరమైన చోటకొత్త సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, మాలోతు రాందాస్ నాయక్, ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, టి.సదర్‌లాల్, వి.తిరుపతిరెడ్డి, టి.మధుసూదన్, సీజీఎంలు కె.రాజుచౌహాన్, కె.కిషన్, కే.ఎన్.గుట్ట, బికం సింగ్, ఎస్‌ఈలు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం..


- 30 తులాల బంగారం, వెండి వస్తువులు, సర్టిఫికెట్లు దగ్ధం
- మహబూబాబాద్‌లో ఘటన



అగ్నికి ఆహుతైన వస్తువులు, ఇతర సామగ్రి

మహబూబాబాద్ రూరల్ : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి అపార్ట్ మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో విలువైన వస్తువులు, డాక్యుమెంట్లు, 30 తులాల బంగారు, వెండి ఆభరణాలు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మంగళవారం మహబూబాబాద్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. జిల్లా కేంద్రంలోని కంకర బోడు ప్రాంతంలో గల ఎస్వీ టవర్స్ 3వ అంతస్తులోని 303 అపార్ట్ మెంట్‌లో పొగలు రావడాన్ని గమనించిన వాచ్ మెన్, అతడి భార్య అందులో ఉండే వారందరికీ తెలపగానే వెంటనే పరుగులు తీశారు. 101కు కాల్ చేసి పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు ఘటనా స్థలికి చేరుకున్నారు. అగ్నిమాపక వాహనం అక్కడికి చేరుకున్నప్పటికీ అందులోని నీళ్ల సరఫరా చేసే యంత్రం మొరాయించింది. దీంతో యువకులు బకెట్లు, పైపులతో నీళ్లు చల్లి ఎగసిపడుతున్న మంటలు ఆర్పివేశారు. మరిపెడ, డోర్నకల్ ప్రాంతాల నుంచి రెండు అగ్నిమాపక వాహనాలు ఘటనా స్థలికి చేరుకుని మిగతా ఫ్లాట్లకు మంటలు వ్యాపించకుండా నివారించారు. ఈ ఘటనలో 303 ఫ్లాట్‌లో ఉంటున్న ఇండియన్ బ్యాంకు ఉద్యోగి జీవితకు చెందిన సర్టిఫికెట్లు, వస్తువులు, 30 తులాల బంగారం, వెండి ఆభరణాలు కాలిబూడిదయ్యాయి. కాగా, అగ్నిమాపక వాహనంలోని యంత్రం మొరాయించడంతోనే వస్తువులు దగ్ధమయ్యాయని జీవిత పేర్కొంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మురళీనాయక్ ఘటనా స్థలాన్ని సందర్శించి, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి



సాంబయ్య (ఫైల్)

ములుగు రూరల్: పాము కాటుతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని అబ్బాపూర్‌లో చోటు చేసుకుంది. కుటుంబీకుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సాయబోయిన సాంబయ్య(55) తన వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో కేకలు వేయగా చుట్టుపక్కల రైతులు ఘటనా స్థలికి చేరుకునే సమయానికి సాంబయ్య అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు సాంబయ్యను ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సాంబయ్య మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడికి భార్య సరోజన, కుమారులు ఇద్దరు ఉన్నారు.